క్లుప్తంగా

వ్యవసాయం, విద్యపై అవగాహన



కొల్లిపర: మండల కేంద్రంలో అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ సి.సంధ్యారాణి ఆధ్వర్యంలో బాపట్ల వ్యవసాయ కళాశాల రావెప్ విద్యార్థులు జాతీయ సేవా పథకం ద్వారా వివేక స్కూల్ విద్యార్థులకు గురువారం వ్యవసాయం, విద్య పై అవగాహన కల్పించి క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అవుతురామిరెడ్డి జూనియర్ కళాశాల ట్రెజరర్ బి.ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న వర్మికంపోస్టు కేంద్రం వద్ద వ్యవసాయ కళాశాల విద్యార్థులు వర్మికంపోస్టు వలన వ్యవసాయంలో కలుగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సువర్ణలత, రామిరెడ్డి కళాశాల ప్రిన్స్‌పల్ ప్రేమ్ కుమార్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హాస్య నటచక్రవర్తి కాళిదాసు కోటేశ్వరరావుకు నివాళి



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు 'హాస్య నటచక్రవర్తి' కాళిదాసు కోటేశ్వరరావు 40వ వర్ధంతిని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బోసురోడ్డులోని ఆయన కాంస్య విగ్రహానికి మా–ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా, రంగస్థల కళాకారుల సంఘం కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాకారులు 50 మందికి చీరలు, పంచెలు పంపిణీ చేశారు. కళాకారులు దీపాల సుబ్రహ్మణ్యం, లక్ష్మీతులసి, గుమ్మడి విమలకుమారి, పెదనాగమణి, సత్యవతి, శివపార్వతి, తులసి సామ్రాజ్యం, వైఎస్సార్‌సీపీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు కోలా వాసు, పి.నవీన్, బుజ్జి పాల్గొన్నారు. కాళిదాసు విజయసత్యం పర్యవేక్షించారు.

బౌద్ధం సదా ఆచరణీయం

వీసీ ఆచార్య పి.రాజశేఖర్



ఏఎన్‌యూ: నేటి సమాజ దిక్సూచీగా బౌద్ధం నిలుస్తుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. వర్సిటీలోని బౌద్ధ అధ్యయన విభాగం ఆధ్వర్యంలో గురువారం బుద్ధ పూర్ణిమ వేడుకలు నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ బుద్ధ పూర్ణిమ, బౌద్ధ ధర్మం విశిష్టత ఎంతో గొప్పదన్నారు. బుద్ధుని ధర్మ విషయాలు అందరికీ ఆచరణ యోగ్యమైనవని, అవి సమాజానికి ఎంతో మార్గదర్శనమన్నారు. బౌద్ధ సిద్ధాంతాలు నేటి యువత అలవర్చుకొని రాణించాలని సూచించారు. జీవిత లక్ష్యాలను సాధించే క్రమంలో శాంతి, సహనం, కృషి, పట్టుదల వంటివి అలవర్చు కోవాలని చెప్పారు. బౌద్ధ అధ్యయన విభాగ అధిపతి ఆచార్య ఎల్.ఉదయ్ కుమార్ బౌద్ధ జయంతి ప్రాముఖ్యత, అధ్యయనం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య గంగాధరరావు, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, విదేశీ విద్యార్థుల విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ జి.చెన్నారెడ్డి, దూర విద్య పరీక్షల విభాగ సమన్వయకర్త డాక్టర్ కె.సోమశేఖర్, అతిథి అధ్యాపకులు, పరిశోధకులు, బౌద్ధ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా మహా విద్య హోమం



నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డి నగర్‌లోని శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి దేవస్థానంలో గురువారం మహా విద్య హోమం వైభవంగా నిర్వహించారు. ఆలయ హోమశాలలో గుండాన్ని సుందరంగా అలంకరించి, గణపతి హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నాగార్జున శర్మ హోమాలు చేశారు. మహా విద్య మూల మంత్రాలతో హోమం శాస్త్రోక్తంగా చేపట్టగా, కనుల పండువగా పూర్ణాహుతి చేశారు. ఆలయ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి పర్యవేక్షణలో మహా విద్య హోమం జరగ్గా, దాసరి రాము, లీలాకృష్ణ, కృష్ణశ్రీ, భక్తులు పాల్గొన్నారు.

రక్తదానంతోప్రాణదానం

- విస్తృతమవుతున్న తెనాలి బ్లడ్‌బ్యాంక్ సేవలు
- ప్లేట్‌లెట్స్ సేకరించే యూనిట్‌కు అనుమతులు
- త్వరలో తెనాలి రానున్న పరికరాలు

'ప్రాణం అంతా రక్తంలోనే ఉంది / రక్తదానం చేసి ప్రాణ దాతలు కండి', 'నువ్వు ఇచ్చే రక్తం మరొకరికి జీవితం–ప్రాణము', 'తల్లి కన్నీరు కాపాడలేని బిడ్డ ప్రాణాన్ని మీ రక్తదానం కాపాడొచ్చు', ' రక్తదానం చేయండి.. అది ఓ ఆశని, ఒకరికి జీవితాన్ని ఇస్తుంది', 'అన్నదానం ఆకలిని మాత్రమే తీర్చుతుంది / కానీ రక్తదానం ఒకరి ప్రాణాన్ని నిలబెడుతుంది' ... ఇలా ఎన్నో నీతి వాక్యాలు రక్తదానం చేయమని చెబుతూ ఎందరో ప్రాణాలు నిలుపుతున్నాయి. అలా దాతలనుంచి సేకరించి రక్తాన్ని భద్రపరిచి అత్యవసరమైన రోగులకు దానిని అందించి సకాలంలో వారి ప్రాణాలు నిలబెడుతోంది తెనాలిలో జిల్లా వైద్యశాల బ్లడ్ బ్యాంక్.

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్ సేవలు విస్తృతం అవుతున్నాయి. ఇప్పటి వరకు ఇక్కడ రక్త సేకరణ, వాటిని పరీక్షించి అవసరమయిన రోగులకు పంపిణీ చేయటం వరకు జరుగుతూ వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం దీనిని అప్‌గ్రేడ్ చేయటంతో పాటు దీనిలో రక్తం నుంచి ప్లేట్‌లెట్స్, పాకర్ సేల్స్ వంటి వాటిని వేరు చేసే యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు గత ఏడాది డిసెంబర్‌లో అనుమతులు ఇచ్చింది. దానికి సంబంధించిన పరికరాలు త్వరలో తెనాలి రానున్నాయి. తెనాలి ఏరియా వైద్యశాలలో 1998లో బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో రక్త సేకరణ జరపటం... వాటిని గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలకు పంపి పరీక్షలు జరిపేవారు. అనంతరం వాటిని తెనాలిలోని జిల్లా వైద్యశాలలోని రోగులకు వాటిని ఉపయోగించేవారు. ఇలా జరుగుతుండగా ఆస్పత్రిని జిల్లా వైద్యశాలగా అప్‌గ్రేడ్ చేసి పాత ప్రభుత్వ వైద్యశాల నుంచి చెంచుపేటలోని నూతన భవనంలోని వైద్యశాలను సుమారు రెండు సంవత్సరాలకు మార్పు చేశారు. జిల్లా వైద్యశాలలో బ్లడ్ బ్యాంక్ కోసం ప్రత్యేక బ్లాక్‌ను కేటాయించారు. అనంతరం అక్కడ రక్త సేకరణ జరిపిందుకు అవసరమైన బెడ్‌లు, కుర్చీలు వంటి వాటిని ఏర్పాటు చేశారు. అలాగే సేకరించిన రక్తాన్ని అక్కడే పరీక్షలు జరిపి వాటిని రోగులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం 300 ప్యాకెట్ల బ్లడ్‌ను భద్రపరిచే ఫ్రిజ్‌లు ఉన్నాయి. అలాగే పరీక్షలు జరిపేందుకు అవసరమైన పరికరాలు, ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్‌లు, ఒక స్టాఫ్ నర్సు, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జిగా ఒక వైద్యురాలిని నియమించారు.

సుమారు 50వేల మందిని ఆదుకున్న బ్లడ్ బ్యాంక్.

తెనాలి బ్లడ్ బ్యాంక్‌లో నెలకు సుమారు 200 ప్యాకెట్‌ల రక్తాన్ని సేకరిస్తున్నారు. ఏడాదికి సుమారు రెండు వేల ప్యాకెట్‌లను రోగులకు పంపిణీ చేస్తున్నారు. జిల్లా వైద్యశాల, తల్లిపిల్లల వైద్యశాలలోని రోగులకు రక్తం అవసరం అయితే వారికి ఉచితంగా ఇస్తారు. ప్రవేట్ వైద్యశాల రోగులకు అయితే ప్యాకెట్‌కు రూ.800 చొప్పున వసూలు చేస్తుంటారు. తెనాలిలో బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 50 వేల ప్యాకెట్‌లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.



తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంక్



ఫ్రిజ్‌లో భద్రపరిచిన బ్లడ్ ప్యాకెట్లు

అలాగే రక్త సేకరణకు ప్రత్యేక వాహనాన్ని కూడా ప్రభుత్వం తెనాలికి పంపింది. దానిని ఉపయోగించి అనేక గ్రామాల్లో, పట్టణంలోని పలు ప్రాంతాల్లో బ్లడ్ డోనేషన్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు.

తెనాలికి ప్లేట్ లెట్‌లు సేకరించే యూనిట్

తెనాలి జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్‌లో డెంగ్యూ బాధితులకు అవసరమైన ప్లేట్‌లెట్స్‌ను సేకరించే యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు గతేడాది డిసెంబర్‌లో ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీనికి సంబంధించిన పరికరాలు (బ్లడ్ కాంపోనెంట్ ప్రిపరేషన్ మిషనరీ, ఫ్రిజ్‌లు) త్వరలో తెనాలి రానున్నాయి. సాధారణంగా రక్తంలోఆర్ బీ ఎస్, డబ్ల్యూబీసీ, ప్లేట్‌లెట్స్ వంటి మూడు రకాల కణాలు ఉంటాయి. నూతనంగా జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేయనున్న యూనిట్ వల్ల వాటిని వేరు చేయవచ్చు. ఆర్‌బీఎస్ రక్తహీనత తక్కువగా ఉన్న వారికి ఉపయోగిస్తారు. డబ్ల్యూబీసీ (పాకర్‌సెల్స్) రియాక్షన్ వచ్చిన వారికి దీనిని ఎక్కించటం వల్ల అది తగ్గుతుంది. డెంగ్యూ సోకిన వారికి ప్లేట్ లెట్స్ తగ్గిపోతాయి. అలాంటి వారికి ప్లేట్ లెట్స్‌ను ఎక్కించటం వల్ల త్వరగా కోలుకునే అవకాశం ఉంది.



ప్రత్యేక వాహనంలో రక్తసేకరణ జరుపుతున్న సిబ్బంది

రక్తదానంతో ఎంతో ఉపయోగం



తెనాలి జిల్లా వైద్యశాలలోని బ్లడ్ బ్యాంక్‌లో అనేక మంది దాతలు రక్తదానం చేస్తున్నారు. ఎవరైన క్యాంప్‌లు ఏర్పాటు చేసి తమకు తెలియజేస్తే అక్కడికి తాము వచ్చి రక్తాన్ని సేకరిస్తాం. అలా సేకరించిన రక్తాన్ని అవసరమైన రోగులకు పంపిణీ చేస్తున్నాం. రక్తదానం చేయటం వల్ల పలువురికి ప్రాణదానం చేసిన వారు అవుతారు. రక్తదానం చేయటం వల్ల ఎటువంటి అనారోగ్య సమస్యలు రావు. అందరు రక్తదానం చేసేందుకు ముందుకురావాలి.

–డాక్టర్ ప్రసన్న, బ్లడ్ బ్యాంక్, ఇన్‌చార్జి, జిల్లా వైద్యశాల, తెనాలి.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి



తెనాలి: సార్వత్రిక ఎన్నికల్లో తెనాలి అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కు మరోసారి ఎమ్మెల్యేగా విజయం చేకూరనుందని మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివ రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యకు గెలుపు అవకాశం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ గాలి వీచినందున వచ్చే నెల నాలుగో తేదీన జరగనున్న కౌంటింగ్‌లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని చెబుతూ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి అవుతారని స్పష్టం చేశారు. పోలింగ్ సరళి ప్రకారం బీజేపీకి దేశవ్యాప్తంగా ప్రాభవం తగ్గుతోందని, మన రాష్ట్ర ఎంపీ ఓట్లే కీలకమైతే రాష్ట్రానికి మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. కేంద్ర రాజకీయాల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి గౌరవప్రదమైన స్థానం లభిస్తుందని, రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా లభించే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు.

అర్జీలను వెంటనే పరిష్కరించండి



తెనాలిఅర్బన్: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఉద్యోగులతో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13 వరకు ఎలక్షన్ విధులను ఉద్యోగులందరూ నిర్వహించినట్లు చెప్పారు. ఇప్పటి నుంచి ప్రజ సమస్యల పరిష్కారానికి దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, మేనేజర్ అప్పలరాజు, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మరమ్మతులు వెంటనే పూర్తి చేయండి

తెనాలిఅర్బన్: 32వ వార్డులోని కొడాలి వీరయ్య మున్సిపల్ పార్కులోని మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. గురువారం పార్కును పరిశీలించారు. అక్కడ చేస్తున్న మరమ్మతులపై ఆరా తీశారు. అనంతరం 25వ వార్డులో పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మంచినీటి సరఫరాకు ఎటువంటి అంతరాయలు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట ఏఈ రాజు, హార్టికల్చరల్ ఆఫీసర్ శేషబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

సెల్‌ఫోన్ చోరీ కేసులో నిందితుల అరెస్ట్

తెనాలిరూరల్: సెల్‌ఫోన్ చోరీ కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ సుల్తానాబాద్‌లోని ఓ దుకాణంలో దాని నిర్వాహకుడు తన సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టి వెళ్లాడు. దుకాణానికి వెళ్లిన ముగ్గురు యువకులు సెల్‌ఫోన్ అపహరించుకెళ్లారు. దీనిపై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేయగా, నిందితులను గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్టు ఎస్ఐ నక్కా ప్రకాశరావు తెలిపారు.

దళిత యువకుడిపై హత్యాయత్నం

పాత కక్షల నేపథ్యంలో ఖాజీపేటలో ఘటన

తెనాలిరూరల్: పాత కక్షల నేపథ్యంలో దళిత యువకుడిపై హత్యాయత్నం చేసిన ఘటన తెనాలి మండలం కాజీపేట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. కొలకలూరుకు చెందిన ఉన్నం అరుణ్‌కుమార్ ఓ హైకోర్టు న్యాయవాది వద్ద గుమాస్తాగా పని చేస్తుంటాడు. మార్చిలో విధులకు వెళ్లి వస్తుండగా ఖాజీపేట వద్ద చెన్నంశెట్టి సురేష్, ప్రదీప్‌ల కారణంగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఇరు గ్రామాల పెద్దలు మాట్లాడి రాజీ కుదిర్చారు. ఈక్రమంలో గురువారం సాయంత్రం ఖాజీపేటలోని పెట్రోలు బంకు వద్ద అరుణ్‌కుమార్ తన బైక్‌లో పెట్రోలు పోయించుకుంటున్నాడు. అదే సమయంలో అక్కడికి వెళ్లిన సురేష్, ప్రదీప్ అతనితో ఘర్షణ పడ్డారు. పెట్రోలు బంకు నుంచి పక్కకు తీసుకెళ్లి మారణాయుధాలతో దాడి చేశారు. గాయపడిన అరుణ్ తన బంధువులకు ఫోన్ చేయగా కొలకలూరుకు చెందిన ఉన్నం గోపి, కూచిపూడి కిరణ్ ఖాజీపేటకు చేరుకోగా వీరిద్దరిపైనా దాడి చేశారు. తలకు తీవ్రగాయాలైన అరుణ్‌కుమార్ నేరుగా రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు అతన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సెక్షన్ 324, ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.



గాయపడిన అరుణ్‌కుమార్

తెనాలిలో తగ్గిన ఓటింగ్ ఎవరిది?

- రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ
- పోలింగ్ రోజు వర్షంతో రాని ఓటర్లు
- కూటమి అనుకూల వర్గాలేనని విశ్లేషణ

తెనాలి: సార్వత్రిక ఎన్నికల్లో తెనాలి పట్టణంలో తగ్గిన ఓటింగ్ అధికార వైఎస్సార్ సీపీకి కలిసొస్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. పట్టణంలో దాదాపు 49 వేలమంది ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. పోలింగ్ రోజున ఇక్కడ వర్షం కురవటంతో ఆయా వర్గాలకు చెందిన పలువురు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. వీరిలో అత్యధికులు కూటమి పార్టీలకు మద్దతునిస్తున్న సామాజిక వర్గాలేనని చెబుతున్నారు. అధికార వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి ఇది అనుకూలమని లెక్కలు వేస్తున్నారు.

ఈనెల 13వ తేదీన పోలింగ్ ముగిసిన తర్వాత వైఎస్సార్ సీపీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తన గెలుపుపై ధీమా వ్యక్తంచేసిన విషయం తెలిసిందే. గరిష్ఠంగా అందించిన సంక్షేమమే తనను గెలిపిస్తుందని చెప్పారు. కూటమి అభ్యర్థిగా పోటీచేసిన జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా తన గెలుపుపై ఆశావహంగా ఉన్నారని చెబుతున్నారు. ఇదెలాగున్నా పోలింగ్ ముగిసింది లగాయితు అధికార వైఎస్సార్ సీపీ, కూటమి పార్టీల నాయకులు పోలింగ్ సరళిపై దృష్టిని సారించారు. ఏయే పోలింగ్ బూత్‌ల్లో ఏమేరకు ఓటింగ్ జరిగింది? అక్కడ గల ప్రధాన సామాజిక వర్గాల ఓటర్లు ఎవరు? వారిలో ఎంతమంది ఓటు చేశారు? అనే అంశాలను శోధిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని ఆశ్చర్యకమైన విశేషాలు చర్చలోకి వచ్చాయి. ఉదాహరణకు పట్టణ ఆరో వార్డులోని 122, 123, 124, 125 పోలింగ్ బూత్‌ల్లో మొత్తం ఓట్లు 3,918 కాగా, 2,625 ఓట్లు పోలయ్యాయి. ఈ వార్డులో కూటమికి మద్దతునిచ్చే ప్రధాన సామాజిక వర్గాల్లో ఒక వర్గానికి 900 ఓట్లు ఉంటే ఆయా బూత్‌ల్లో 64,103,73,68 చొప్పున కేవలం 308 మాత్రమే పోలయ్యాయి. మరో సామాజికవర్గం ఓటర్లు 61,107, 59, 80 వంతున 307 మంది ఓటు చేశారు. అంటే ఇద్దరు కలిసి 615 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. 10వ వార్డుల్లో ప్రధానమైన సామాజికవర్గం ఓటర్లు 1200 మంది ఉంటే, 216, 217, 218, 219 పోలింగ్ బూత్‌ల్లో కేవలం 609 మాత్రమే ఓటు చేశారు. ఇక్కడ మొత్తం ఓట్లు 3,983 కాగా, 2,762 ఓట్లు పోలయ్యాయి. పట్టణ 11వ వార్డులో ఇదే సామాజికవర్గం ఓటింగ్ మరీ తక్కువగా ఉంది. ఇక్కడ 193, 195, 197, 198, 199 పోలింగ్ బూత్‌ల్లో కేవలం 579 మంది మాత్రమే ఓటు వేశారు. స్థానిక 31వ వార్డులోని 61, 62, 63 పోలింగ్ బూత్‌ల్లో మొత్తం 3,498 ఓట్లు ఉండగా, 2,290 ఓట్లు పోలయ్యాయి. ఈ వార్డులో ఒక సామాజికవర్గానికి 300 ఓట్లు ఉంటే 101, మరో సామాజికవర్గానికి 600 ఓట్లకుగాను 337 ఓటు వేసినట్టు లెక్కలు వేశారు. కూటమి పార్టీలకు చెందిన రెండు ప్రధాన సామాజిక వర్గాలే కాకుండా మరో ముఖ్యమైన సామాజిక వర్గం ఓటర్లు కూటమికి మద్దతునిచ్చారని, ఆయా పార్టీల నేతలు చెబుతున్న విషయం తెలిసిందే. 129, 130, 141, 142, 143 పోలింగ్ బూత్‌ల్లో మొత్తం ఓట్లు 5,009కు గాను, 3,278 ఓట్లు పోలు కాగా, పైన చెప్పుకున్న సామాజికవర్గం ఓటర్లు 1,059 మాత్రమే ఓటు వేశారు. ఇదే సామాజిక వర్గం ఓటర్లు 152, 153, 155, 156 పోలింగ్ బూత్‌ల్లోనూ కేవలం 560 మంది మాత్రమే ఓటు వేశారని అంచనా వేస్తున్నారు. ఈ ప్రకారంగా చూస్తే పట్టణంలో కూటమికి అత్యధికశాతం ఓటర్లు మద్దతునిస్తున్నట్టుగా చెప్పుకునే మూడు ప్రధాన సామాజిక వర్గాల్లో ఎక్కువమంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నట్టు స్పష్టమవుతోంది. ఆయా సామాజికవర్గాల ఓటర్లు ఉదయం పోలింగ్ బూత్‌ల ముందు క్యూలు కట్టినా మధ్యాహ్నం తర్వాత చాలామంది పోలింగ్ కేంద్రాలకు రాలేదంటున్నారు. సంక్షేమం అందుకున్న లబ్ధిదారులుగా వేరే పార్టీకి ఓటు వేయటం నచ్చకపోవటం, దీనికితోడు మధ్యాహ్నం కురిసిన వర్షంతో ఇంటి దగ్గరే విశ్రాంతి తీసుకున్నట్టు భావిస్తున్నారు. చిత్రంగా రూరల్ మండలం, కొల్లిపర మండలాల్లో కాకుండా కేవలం పట్టణంలోనే వర్షం కురవటం కూడా ఇక్కడ ఓటింగ్ శాతం తగ్గడానికి కారణమంటున్నారు. ఏదేమైనా ఈ గణాంకాలు నిజమైతే కూటమి కొంప మునిగినట్టేనని చర్చల్లో తేలుస్తున్నారు.



పోలింగ్ రోజున ఉదయం బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

ఘనంగా తాళ్లపాక అన్నమయ్య జయంతి



అన్నమాచార్య కీర్తనల గానం చేస్తున్న గాయకులు

తెనాలి: పదకవితా పితామహుడు శ్రీ అన్నమయ్య 616వ జయంతి ఉత్సవాలను గురువారం సాయంత్రం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కళావేదికలో ఘనంగా నిర్వహించారు. మహతి, శ్రీ రామలింగేశ్వర భక్త సమాజం, శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన బృందం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో తొలుత శ్రీ వెంకటేశ్వర స్వామి, అన్నమయ్యకు అర్చన చేశారు. అనంతరం టీవీఎస్ శాస్త్రి, పర్చూరు సుబ్బారావు, కొండపి వసుంధరలు దేవి లలిత, యశస్విని, తుల్య శ్రీ, తులసి, శర్వాణితో కలిసి అన్నమయ్య కీర్తనలను జనరంజకంగా ఆలపించారు. ఈ సంకీర్తన కార్యక్రమానికి తబలాపై పెరవలి వంశీకృష్ణ, కీబోర్డుపై జి.నాగసాయి (గుంటూరు) వాద్య సహకారం అందించారు. నిర్వాహకుడు కొండపి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2010 సంవత్సరం నుంచి అన్నమాచార్యులు జయంతి ఉత్సవాలు, వర్ధంతి ఉత్సవాలు చేస్తున్నామని తెలిపారు. శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల జీవిత విశేషాలు, ఆయన ప్రాభవాన్ని వివరించారు. సురాభతుల కేశవ, అందే బాలచంద్ర మౌళి, కల్లూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సలో వైద్యుని నైపుణ్యత పైనే ఫలితాలు

గుంటూరు మెడికల్: గుంటూరులోని ఓ హోటల్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సంయుక్తంగా నిరంతర వైద్య విద్యా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జి.జగదీష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ జి.జగదీష్ మాట్లాడుతూ.. వైద్యులు మల్టిపుల్ ఫ్రాక్చర్స్ విషయంలో సరైన నిర్ణయం, సక్రమ శస్త్ర చికిత్స ద్వారా బాధితులకు మళ్లీ సాధారణ జీవితాన్ని అందించవచ్చునన్నారు. ఇదే ప్రథమ లక్ష్యం కావాలని యువ వైద్యులకు తెలిపారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ పీఎస్ఎస్ హరిత 'హార్ట్ ఫెయిల్యూర్ జీవితానికి అంత్య దశ' అనే అంశంపై ప్రసంగించారు. హార్ట్ ఫెయిల్యూర్ గుండె సంబంధ వ్యాధుల్లో అంత్య దశ కాదని చికిత్స ద్వారా మళ్లీ తిరిగి గుండెను మామూలు స్థితికి తీసుకురావచ్చన్నారు. డాక్టర్ జి.జగదీష్, డాక్టర్ చిత్తరంజన్ సాహు, డాక్టర్ పీఎస్ హరితలకు ఐఎంఏ గుంటూరు బ్రాంచ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ వెలగా మహేష్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ బి.సాయి కృష్ణ, రమేష్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ మమత ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ చిత్తరంజన్ సాహూ, డాక్టర్ టి.సేవకుమార్ పాల్గొన్నారు.



వైభవంగా అన్నమయ్య జయంతి



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో గురువారం అన్నమయ్య జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు సతీష్ స్వామి ఆధ్వర్యంలో మూల విరాట్‌కు ప్రత్యేక అర్చనలు, అలంకరణ జరిగాయి. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, ఎంవై.శేషురాణి, కాజా వేంకటసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కొనసాగిన ధారవాహిక ప్రవచనం

స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై ఐదు రోజులపాటు నిర్వహిస్తోన్న శ్రీమద్భగవద్గీత – ఆత్మ సంయమయోగః ధారా వాహిక ప్రవచనం గురువారం కొనసాగింది. ఆలయ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు.